క్లుప్తంగా

సేంద్రియ ఉత్పత్తులకు గిరాకీ

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం సేంద్రియ కూరగాయలు, పండ్లు, ఆకు కూరల స్టాల్‌ను ఏర్పాటు చేస్తుంటారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ సెల్‌కు జిల్లా నలుమూలల నుంచి తరలివస్తారు. అలానే అర్జీదారులతో పాటు అధికారులు కూరగాయలు కొనుగోలు చేస్తుండటంతో వీటికి గిరాకీ పెరిగింది.

ఉత్తమ టీచర్‌కు సన్మానం



పెనగలూరు : చక్రంపేటలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సాంఘీక శాస్త్రం ఉపాధ్యాయుడు ఎ.సుదర్శన్‌ను జిల్లాస్థాయి ఉత్తమ టీచర్ అవార్డు పొందారు. ఈ సందర్భంగా ఆయన్ను పాఠశాల తరపున సోమవారం ఘనంగా సన్మానించారు. ఆయన పాఠశాలకు చేసిన సేవలు, సామాజిక కార్యక్రమాలను కొనియాడారు.

అధ్యాపకుడికి డాక్టరేట్



బొంగాని కిరణ్‌కుమార్

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న బొంగాని కిరణ్‌కుమార్‌కు ఎస్వీయూ డాక్టరేట్ ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. కిరణ్‌కుమార్ ప్రొఫెసర్ బి.దేవప్రసాద్‌రాజు పర్యవేక్షణలో 'ఆప్టికల్ అండ్ లుమినిసెన్స్ ప్రాపర్టీస్ ఆఫ్ నియోడియం, ఇటర్బియం/నియోడియం, ఎర్బియం డోప్డ్ ఆక్సిఫ్లోరైడ్ గ్లాసెస్ ఫర్ ఫోటోనిక్ అప్లికేషన్స్' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినట్టు తెలియజేశారు. డాక్టరేట్ పొందడం అభినందనీయమని ప్రిన్సిపల్ తెలిపారు.

ఇంటింటి చదువు ఊరంతా వెలుగు

సుండుపల్లె : ఇంటింటా చదువు ఊరంతా వెలుగును నింపుతుందని ఎంఈఓ-2 రవీంద్రనాయక్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ తీసి మానవహారంగా నిలుచున్నారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ వయోజనలో చక్కగా విద్య నేర్చుకుని దేశ అభివృద్ధికి ప్రగతి బాటలు వేయాలని తెలిపారు. విద్య ఆవశ్యకతను, ఇల్లాలి చదువు ఆవశ్యకతను వివరించారు. నిరక్షరాస్యత వల్ల ఏ రకంగా కలుగుతుందో దోపిడీలు, అసాంఘిక అరాచకాలు, దురాచరాలకు లోనవుతారో తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సురేష్‌బాబు, ఏపీఎం శ్రీనివాసులు, ఎంఎస్‌ఆర్ విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియా మంజూరు

సిద్దవటం : సిద్దవటం మండలానికి యూరియా మంజూరైందని మండల వ్యవసాయ అధికారి రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మండలానికి 20 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, జ్యోతి రైతు సేవా కేంద్రానికి 6.975 మెట్రిక్ టన్నులు, వంతాటిపల్లి రైతు సేవా కేంద్రానికి 6.975 మెట్రిక్ టన్నులు, మాచుపల్లి రైతు సేవా కేంద్రానికి 6.975 మెట్రిక్ టన్నుల యూరియా ఆయా రైతు సేవా కేంద్ర పరిధిలో అందుబాటులో ఉందని చెప్పారు.

నీటి సమస్య పరిష్కారం

వీరబల్లి : మండలంలోని మట్లి గ్రామపంచాయతీలోని బత్తినవాండ్లపల్లిలో ఇటీవల స్కీమ్ బోరు చెడిపోగా నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని గ్రామ సర్పంచ్ నాగార్జునాచారికి తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన సోమవారం స్కీమ్ బోరుకు మరమ్మతులు చేయించి నీటి సమస్యను పరిష్కరించారు. దీంతో గ్రామస్తులు ఆయన్ను అభినందించారు.

ఆక్రమణలను అడ్డుకోండి



కలెక్టరేట్‌లో సంబేపల్లె గ్రామస్తులు

రాయచోటి టౌన్ : గ్రామాలలో చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవుతున్నాయని అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి సోమవారం సంబేపల్లె మండలానికి చెందిన మల్లికార్జున ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు వివరాలు.. రాయచోటి పరిధిలోని పేయల వాండ్లపల్లె పొలంలోని పెద్ద కుంట (సర్వేనంబర్ 220/ 285/3)లో 1.60 ఎకరాల భూమిని రాయచోటి మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామంలోనిదని చెప్పారు. దీనిపై పూర్తి స్థాయి దర్యాప్తు చేసి ఆక్రమిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్నదాత పోరును విజయవంతం చేయండి

సంబేపల్లె : కూటమి ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నందుకు నిరసనగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాయచోటిలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాత పోరును విజయవంతం చేయాలని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు అందరూ 9వ తేదీన గడికోట శ్రీకాంత్ రెడ్డి కార్యాలయం వద్దకు చేరుకోవాలని పిలుపునిచ్చారు.

కూటమి రైతు వ్యతిరేక పాలనకు నిరసనగా..

నేడు రాయచోటిలో వైఎస్సార్‌సీపీ 'అన్నదాత పోరు'

- రైతులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపు
- యూరియా కొరత, గిట్టుబాటు ధర కోసం పోరాడుదామన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నందలూరు: రైతు పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు



వీరబల్లి: పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందలూరు : చంద్రబాబు పాలనలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ సిద్దవరం గోపిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని కలెక్టరేట్ వద్ద నిర్వహించే అన్నదాత పోరును విజయవంతం చేయాలని గోపిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లాక్ మార్కెట్‌లో ఎరువుల అమ్మకం ఎక్కువగా జరగడం వలన రాష్ట్రంలో రైతులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ఉన్న రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు గొబ్బిళ్ల త్రినాథ్, నడివీధి సుధాకర్, గుండు మల్లికార్జునరెడ్డి, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ముమ్మడిశెట్టి సుధ, ఉపసర్పంచ్ ఇబ్బు, ఆనాల మధుయాదవ్, గోల్డ్ మస్తాన్, షేక్ రఫీ, విజయుడు, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

రైతులు స్వచ్ఛందంగా పాల్గొనాలి

సుండుపల్లె : సాగుకు ఎరువులను అందించలేని ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిందేనని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు ఈ నెల 9న (నేడు) జరిగే అన్నదాత పోరు కార్యక్రమ పోస్టర్లను సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో మండల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి మాట్లాడుతూ రైతుల ప్రధాన సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు ఆరంరెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శి రెహమాన్‌ఖాన్, ఆనంద్‌రెడ్డి, సుండుపల్లి మండల సోషల్ మీడియా కన్వీనర్ సయ్యద్ సల్మాన్, పెద్దినేనికాలువ ఉపసర్పంచ్ రఫీ, ఎస్టీ నాయకులు చంద్రనాయక్, శివాలయం మాజీ చైర్మన్ శంకర, టి.రామాంజనేయులు, చింటూ, యువనాయకులు రాజశేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్న సమస్యలపై వైఎస్సార్‌సీపీ పోరు

ఒంటిమిట్ట : రైతన్నకు బాసటగా రైతు సమస్యలపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నేడు తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన ఒంటిమిట్టలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు టక్కోలు శివారెడ్డి ఆధ్వర్యంలో వేణుగోపాల్ రెడ్డి నాయకులతో కలిసి అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రైతుల కష్టాలు ప్రారంభమయ్యాయన్నారు. పంటల సాగు మొదలు పెడదామంటే అవసరమైన ఎరువులు అందుబాటులో లేక బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆవేదనను తెలియజేశారు. అన్నదాత పోరు కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, రైతు విభాగం నేతలు, రైతులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజాత, తేలూరు శేషారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, పన్నెల చంద్ర, సుబ్బారెడ్డి, కొత్తపల్లి రవి, తుమ్మలపెంట శ్రీనివాసులు, ముస్లిం మైనార్టీ నాయకులు సత్తార్, మాజీ సర్పంచ్ నరసింహులు పాల్గొన్నారు.

ప్రతి రైతు పాల్గొనాలి

వీరబల్లి : కూటమి సాగిస్తున్న రైతు వ్యతిరేక పాలనకు నిరసనగా మంగళవారం రాయచోటిలో అన్నదాత పోరు నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, రైతులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం ప్రధాన కార్యదర్శి గాలివీటి వీరనాగిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సకాలంలో యూరియా అందించలేకపోతోందని చెప్పారు. మండలంలో అరకొరగా సాగవుతున్న పంటలకు కూడా ఎరువులు అందించకపోవడం దౌర్భాగ్యమన్నారు. బ్లాక్ మార్కెట్‌కు ఎరువులు తరలిపోవడం సిగ్గుచేటన్నారు. రైతుల పక్షాన నిలిచి వారి సమస్యను ప్రభుత్వానికి తెలియజేసి అండగా నిలిచేందుకు అన్నదాత పోరుకు పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడం నాగభూషణం, రాజంపేట నియోజకవర్గం పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, వీరబల్లి వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు సోమల్‌రాజు మునిరాజు, అన్నమయ్య జిల్లా సోషల్ మీడియా అధ్యక్షులు నరేష్ స్వామి, వీరబల్లి మండల ప్రధాన కార్యదర్శి సీతారామరాజు, మండల కార్యదర్శి బివి రమణ, ఎస్సీసెల్ విభాగం అధ్యక్షులు రాము, ఎంపీటీసీ పురుషోత్తం రెడ్డి, మండల సోషల్ మీడియా ప్రెసిడెంటు శివరామకృష్ణ గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యను తెలియజేద్దాం

సిద్దవటం : నేడు అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరీ రెడ్డి, రాజంపేట నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు కొత్తమద్ది వెంకటసుబ్బయ్య, జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్ రెడ్డిలు పిలుపునిచ్చారు. సిద్దవటం మండలం భాకరాపేట మూడురోడ్ల కూడలిలో అన్నదాత పోరు పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి రైతులు, కౌలు రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ అనుబంధ సంస్థ నాయకులు తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతు విభాగం జిల్లా కార్యదర్శి పి.సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి, రైతు విభాగం మండల కన్వీనర్ ఏకుల రామిరెడ్డి, బీసీసెల్ మండల కన్వీనర్ ఎల్లయ్య యాదవ్, ఎంపీటీసీలు శివయ్య, చంద్రశేఖర్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ నూర్, సర్పంచ్ ఈశ్వర్ రెడ్డి, పార్టీ నాయకులు ఎంపీ సుబ్బారెడ్డి, ఎల్‌వీసీ గంగిరెడ్డి, కెవి సుబ్బారెడ్డి, జి ఎల్లారెడ్డి, ఎం రాజారెడ్డి, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.



సుండుపల్లె: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మండల కన్వీనర్ రామస్వామిరెడ్డి



ఒంటిమిట్ట: అన్నదాత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



సిద్దవటం: భాకరాపేటలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పూర్వ విద్యార్థుల ఔదార్యం



పోలీస్ స్టేషన్ వద్ద బల్లలు ఏర్పాటు చేసిన దృశ్యం

రాజంపేట టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో చదువుకున్న పలువురు విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల ఆవరణలో ఆరు బల్లలు, పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద నాలుగు, ప్రభుత్వ హాస్పిటల్‌లో నాలుగు మొత్తం పద్నాలుగు బల్లలు ఏర్పాటు చేశారు. 'మనం - మన స్కూల్ - మన ఊరు' స్ఫూర్తితో రాజంపేట ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బల్లలు ఏర్పాటు చేసినట్లు వారు సోమవారం విలేకరులకు తెలిపారు. పాఠశాలకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు, క్రీడామైదానంలో క్రీడాకారులు, పోలీస్ స్టేషన్, ప్రభుత్వ హాస్పిటల్‌కు వచ్చే ప్రజల సౌకర్యార్థం బల్లలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే తాము చదువుకున్న ప్రభుత్వ హైస్కూల్‌లో ఒక భాగం తక్కువ ఎత్తులో ప్రహరీగోడ ఉండటంతో విద్యార్థుల భద్రత కోసం ప్రహరీపై ముళ్ల కంచె కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



దాతలు, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు

చిట్వేలి: చిట్వేలి-రాపూరు ప్రధాన రహదారిలోని తిమ్మాయపాలెం క్రాస్ రోడ్డువద్ద శ్రీ దత్తగిరి నారాయణ తపోవన ఆశ్రమంలోని వృద్ధులకు బియ్యం, పండ్లు, కూరగాయలు, దీపధూప నైవేద్యం సామగ్రి పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. వ్యవసాయ శాఖలో చిట్వేలి ఏఈఓగా పనిచేసిన నల్లప్ప వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి లక్ష్మీదేవి, కుమారులు మూర్తి, చంద్రశేఖర్, కుమార్తె రమాదేవీలు సరుకులు వితరణ చేశారు. నల్లప్ప ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులు సంతోషంగా జీవించాలని వృద్ధులు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వెంకట సుబ్బయ్య, నాగలక్ష్మమ్మ, పద్మావతమ్మ, నిర్వహకులు చంద్రశేఖర్, మిత్రులు ఆత్మారెడ్డి, కోటి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన నాయకులు



మిథున్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల, మదన్‌రెడ్డి, వత్తలూరు తదితరులు



ఎంపీ కలిసిన పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, ధ్వజారెడ్డి తదితరులు

రైల్వేకోడూరు అర్బన్ : ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటేసేందుకు మధ్యంతర బెయిల్‌పై బయటకొచ్చిన రాజంపేట పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి పలువురు రైల్వేకోడూరు నియోజకవర్గ నాయకులు సోమవారం కలిశారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో పలువురు నాయకులు కలిశారు. నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులను ఎంపీ వాకబు చేసినట్టు తెలియజేశారు. అలానే పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను, రైతులకు మద్దతుగా ఉండాలని నాయకులకు దిశానిర్దేశం చేసినట్టు నాయకులు చెప్పారు. కార్యక్రమంలో పుల్లంపేట మండల అధ్యక్షులు ముద్దా బాబుల్‌రెడ్డి, వీరబల్లి యువనాయకులు గాలివీటి మదన్‌రెడ్డి, కోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, చెవ్వు శ్రీనివాసులురెడ్డి, టంగుటూరి కృష్ణారెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, తోట శివసాయి, సీడీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో అక్షరాస్యత దినోత్సవం



దళవాయిపల్లి పాఠశాలలో అక్షరాస్యత దినోత్సవ వేడుకలో విద్యార్థులు

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వినూత్నంగా పలకలతో అక్షరాలు రాసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ నిరక్షరాస్యులు అందరికీ అక్షరాలు నేర్పించడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు ముందంజలో ఉండాలని పిలుపునిచ్చారు. మనిషి ఎదుగుదలకు విద్య ఒక మూలస్తంభమని, ప్రపంచ నలుమూలల అక్షరాస్యత విలువను తెలపడమే ముఖ్య ఉద్దేశమన్నారు.

రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించాలి

రాజంపేట టౌన్ : రాజంపేట నియోజవర్గంలోని బోయినపల్లె, మాధవరం- 1, 2, ఉప్పరపల్లె ప్రాంతాల్లో మునక ప్రాంతం ప్రజల ఇళ్లు, స్థలాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్రకార్యవర్గ సభ్యులు పాపయ్య 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్‌కు సోమవారం స్థానిక బిజెపి కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. మునక ప్రాంత ప్రజలకు ఎన్‌టీ రామారావు హయాంలో పై ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. ఆ స్థలాల్లో చేనేత కార్మికులు ఇళ్లు కూడా నిర్మించుకున్నారని, అయితే అవి డికెటి పట్టాలు కావడంతో వారు తమ ఆస్తిని తనఖా పెట్టి బ్యాంకుల్లో లోన్లు కూడా తీసుకోలేని పరిస్థితి ఉందన్నారు. అందువల్ల పేద, మధ్య తరగతి చేనేత కార్మికులు తమ పిల్లల చదువులు, వివాహాల సమయంలో ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. చేనేత కార్మికులకు వారి వృత్తిలో కనీస ఆదాయం కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వాటికి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనావుందన్నారు. ఇందుకు లంకా దినకర్ స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పోతుగుంట రమేష్‌నాయుడు, పట్టుపోగుల ఆదినారాయణ, మందపల్లి శ్రీనివాసులు, ఉద్దండం సుబ్రమణ్యం, వివి.రమణ, ఆర్.వెంకటసుబ్బయ్యనాయుడు, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన



మాట్లాడుతున్న సంఘం ప్రాజెక్ట్ మేనేజర్ స్వాతి

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రజా చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో రాయచోటిలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై సోమవారం అవగాహన కల్పించారు. హెచ్ఐవీ/ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చిన్నచూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలో తెలియజేశారు. అలానే క్షయ వ్యాధి సంబంధం, సుఖవ్యాధులు, చికిత్స, కండోమ్ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చిరంజీవి, టీచర్లు గీతాంజలి, గోపాల్‌గౌడ్, నవీనకుమార్, లక్ష్మీప్రసన్న, సుహాసిని, పీఈటి శివరాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు

సిద్దవటం : వాతావరణంలో మార్పులు ద్వారా సీజన్ వ్యాధులు వ్యాప్తి చెందడంతో మండలంలోని మాధవరం-1 ఎస్సీ కాలనీ, వెంకటేశ్వరపురం గ్రామాలలోని అపరిశుభ్రత తొలగింపు చర్యలు చేపట్టి అబేట్, బ్లీచింగ్ పిచికారీ చేయించామని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నరసయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాధవరం గ్రామ సచివాలయంలో మాట్లాడుతూ వాతావరణం మార్పులు వల్ల ఎస్సీ కాలనీ, వెంకటేశ్వరపురం గ్రామాలలో సీజన్ వ్యాధులు కొంత మందికి సోకడంతో ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. దీంతో ఆయా ప్రాంతాలలో మురికి కాలువల్లో ఉన్న అపరిశుభ్రత తొలగించి, సీజనల్ వ్యాధులు సోకిన పేషెంట్లను గుర్తించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో మాధవరం ప్రైమరీ హెల్త్ సెంటర్, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నానో ఎరువులను ఉపయోగించండి



ఓబులవారిపల్లె: రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



చిట్వేలి: నానో యూరియాను ఎలా వినియోగించాలో వివరిస్తున్న అధికారి

ఓబులవారిపల్లె : రైతులు నానో ఎరువులను ఉపయోగించాలని ప్రత్యేకాధికారి సహదేవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిన్నఓరంపాడు కమ్మపల్లి గ్రామంలో నానో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగం వల్ల భూసారం నష్టపోవడంతోపాటు నేలమట్టం మారిపోతుందన్నారు. కావున రైతులు సేంద్రియ ఎరువులతోపాటు నానో ఎరువులను వినియోగించాలని కోరారు. అనంతరం గ్రామ సమీపంలోని అరటితోటను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎంపీడీఓ మల్ రెడ్డి, వ్యవసాయ అధికారిణి మల్లిక, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలిలో..

చిట్వేలి : నానో యూరియా, నానో డీఏపీని వినియోగించడం ద్వారా ఎరువులు వృథా కాకుండా ఎక్కువ మోతాదులో మొక్కలకు అంది పర్యావరణ పరిరక్షణతో పాటు అధిక దిగుబడి పొందవచ్చని ఏఓ సుధాకర్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మయ్యగారిపల్లి, సి. కందులవారిపల్లి గ్రామాలలో రైతులకు నానో, జీవన ఎరువులు, ప్రకృతి వ్యవసాయంలో పీడీఎంఎస్ కిట్స్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఉద్యాన అధికారి ఆయేషా, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, ఆర్ఎస్‌కె సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరిద్దాం

పుల్లంపేట : రసాయన వ్యవసాయాన్ని విడిచి ప్రకృతి వ్యవసాయాన్ని అచరించాలని స్పెషల్ ఆఫీసర్ సతీష్ కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని రెడ్డిపల్లి, అప్పయ్యరాజుపేట గ్రామ పంచాయతీలో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ ప్రాముఖ్యతను, కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూప్రకృతి వ్యవసాయం చేయడం వలన ఖర్చులు తగ్గి ఆదాయం పెంచుకోవచ్చని చెప్పారు. రసాయన ఎరువుల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. అలాగే ఇన్‌చార్జ్ మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి రైతు ఈ-పంట నమోదు తప్పక చేయించుకోవాలని తెలిపారు. అలాగే ఎంపీడీఓ జయశ్రీ మాట్లాడుతూ యూరియా వినియోగం తగ్గించి సేంద్రియ పద్ధతులు అవలంభించాలని రైతులను కోరారు. సేంద్రియ పద్ధతులు అవలంభిస్తే పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్ఓ పుల్లారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, అభ్యున్నత రైతు చంద్రశేఖర్ నాయుడు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై దృష్టి పెట్టాలి



వీరబల్లి: ఎరువులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



పంట పొలాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారిణి లక్ష్మీదేవి

పెనగలూరు : మండలంలోని రైతులు సేంద్రియ ఎరువులపై దృష్టి పెట్టాలని ఎంపీడీఓ విజయారావు తెలిపారు. సోమవారం నారాయణ నెల్లూరు గ్రామంలో రైతులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల కొరత ఉన్నందున రైతులు సేంద్రియ ఎరువులు ఉపయోగించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఎరువుల వాడకం వల్ల ఖర్చు కూడా పెరుగుతుందని, సేంద్రియ ఎరువులు వాటకం వల్ల ఖర్చు తగ్గుతుందని వారు తెలియజేశారు.

వీరబల్లిలో..

వీరబల్లి : మండలంలోని దిగువరాచపల్లి పంచాయతీలో రైతులకు ఎరువుల వినియోగంపై వ్యవసాయ అధికారిణి స్వాతి, తహసీల్దార్ ఖాజా బీ, ఎంపీడీఓ జవహర్ బాబు, మండల స్పెషల్ ఆఫీసర్ హైమావతి, రైతుల అవగాహన సమావేశంలో పాల్గొన్నారు. ఏఓ మాట్లాడుతూ మండలంలో తమ పంటను నమోదు చేయించుకున్న రైతులకే యూరియా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పంటలకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో రైతులకు అవగాహన కల్పించారు. అలాగే రైతులు పశువుల ఎరువులు వాడినట్లయితే పంటలు అధిక దిగుబడి వస్తుందని తెలియజేశారు.

రామాపురంలో..

రామాపురం (రాయచోటి జగదాంబ సెంటర్) : రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని రామాపురం మండల ప్రత్యేకాధికారిణి, మెప్మా పీడీ లక్ష్మీదేవి రైతులకు సూచించారు. సోమవారం రామాపురం మండలం నల్లగుట్టపల్లి, సరస్వతిపల్లి గ్రామాల్లో క్షేత్రస్థాయిలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ సాగు చేసిన పంటలో అధిక దిగుబడులు పొందాలంటే ఎరువులను సమతుల్యంలో వేయాలని రైతులకు సూచించారు. యూరియా వాడకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు.